క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పార్టీలోనికి ఆహ్వానిస్తున్న కవ్వంపల్లి

రామడుగు: అన్నివర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని వెలిచాలలో ఆదివారం పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరగ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శంకర్, పార్టీ అధ్యక్షుడు బి.తిరుపతి, నాయకులు రమేష్, హరీశ్, శేఖర్, పలువురు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని గంగిపల్లిలో ఆదివారం బీఆర్ఎస్, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కవ్వంపల్లి మాట్లాడుతూ.. పార్టీ గెలుపుకోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కవ్వంపల్లి అనురాధ, మండల అధ్యక్షుడు నందగిరి రవీందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గన్నేరువరంలో గడపగడపకూ బీజేపీ



ప్రచారంలో నాగరాజు, అజయ్‌వర్మ

గన్నేరువరం: ప్రధాని నరేంద్ర మోదీ ద్వారా ప్రజలకు సుపరిపాలన సాధ్యమైందని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో నాయకుడు అజయ్‌వర్మతో పాల్గొన్నారు. తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాధించుకున్న రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం దోపిడీ పాలనను కొనసాగిస్తుందని విమర్శించారు. ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయ మని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరాజు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి నికేశ్, మల్లయ్య, సంజీవ్, బుర్ర శ్రీనివాస్, కుర్ర మహేష్, కృష్ణమూరి, శ్రీధర్, పర్శరాం, లక్ష్మణ్, కొంకటి అనిల్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం అందని ద్రాక్షే



మాట్లాడుతున్న సదయ్య

జమ్మికుంట: బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయకుండా, కార్డు ఉన్నవారికే గృహలక్ష్మి పథకం వర్తిస్తుందనడం పేదలకు అందని ద్రాక్షే అవుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని స్వగృహంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ మరో ఎత్తుగడ వేశారని, 2014, 2018 ఎన్నికల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, సొంత స్థలం ఉంటే రూ.5లక్షలు ఇస్తామనే హామీలతో మభ్యపెట్టారని, రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకుల కుమార్‌గౌడ్, జిల్లా ఫిషర్‌మెన్ ప్రెసిడెంట్ మల్లేష్, రవీందర్, రామకృష, శ్రీనివాస్, అశోక్, ఎండీ సలీం, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ

చొప్పదండి: గ్రామాల్లో చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం స్వచ్ఛ సర్వేక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. తడి,పొడి చెత్త, మురుగునీటి నిర్వహణ, ఇతర కార్యక్రమాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్, ఎంఈవో వేణుగోపాల్, వేణు ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

పొలంలో ఆదాయ ఫలం

- పండ్ల మొక్కలు పెంచేందుకు దరఖాస్తుల ఆహ్వానం
- కష్టం తక్కువ.. లాభం ఎక్కువ
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారులు(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: అరుగాలం కష్టించిన రైతులకు ఆర్థిక వెసులుబాటు కలగడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతును ఆర్థికంగా బలపేతం చేసేందుకు వ్యవసేయతర పంటలవైపు వెళ్లేలా సంబంధిత అధికారులతో అవగాహన కల్పిస్తూ నూతన వ్యవసాయం వైపు మరలిస్తున్నారు. ఇందులో భాగంగా పంట పొలాల్లో పండ్ల మొక్కలు పెంచడానికి ప్రభుత్వాలు సన్నాహం చేస్తున్నాయి. హరితహారంలో భాగంగా 2023–24 వార్షిక సంవత్సరంలో 200 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటించనున్నారు. దరఖాస్తుదారులు అంతకంటే అధికంగా వస్తే వారికి కూడా మొక్కలు మంజూరు చేయనున్నారు. అర్హులైన సన్న,చిన్నకారు రైతులు ఈ నెల 26 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా మొక్క నాటిన ఏడాది నుంచి కాకుండా తర్వాత మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు చెల్లించనున్నాయి. ఆసక్తి కలిగిన రైతులు ఉపాధిహామీ జాబ్ కార్డు, పట్టాపాస్ బుక్,ఆయా ధ్రువపత్రాల జిరాక్స్‌లతో సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

• గరిష్టంగా ఐదెకరాలకు..

పంట మొక్కలు నాటుకోవడానికి ప్రభుత్వం గరిష్టంగా ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకు అనుమతి ఇస్తుంది. అంతకంటే ఎక్కువ మొత్తంలో భూమి ఉన్న రైతులు పథకానికి అనర్హులు. ఎంపికైన రైతులు ఏదైనా పండ్ల మొక్కలను ఎంపిక చేసుకోవచ్చు. సాగుచేయాలనుకున్న విస్తీర్ణంలో రెండు మూడు రకాల మొక్కలను కూడా కలిపి నాటుకోవచ్చు. రైతులు వారికి నచ్చిన పండ్ల మొక్కలను నర్సరీ నుంచి తెచ్చుకోవాలి. ఒక్కో మొక్కకు ప్రభుత్వం వేసిన కొటేషన్ ఆధారంగా సదరు రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తారు. ఒక వేళ ప్రభుత్వం సూచించిన ధర కంటే మొక్క ధర అధికంగా ఉంటే ఎక్కువైన ధరను రైతే భరించాల్సి ఉంటుంది. ఎకరం విస్తీర్ణంలో ఎన్ని మొక్కలు అవసరమవుతాయో అధికారులే అంచనా వేస్తారు. వారు సూచించిన ప్రకారం నాటుకోవాలి.

• 16 రకాల పండ్లతోటలకు అనుమతి

రైతులు వారి పంట పొలాల్లో 16 రకాల పండ్ల మొక్కలను నాటుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మామిడి, బత్తాయి, నారింజ, జామ, సపోట, జీడి మామిడి, సీతాఫలం, ఆపిల్బెర్, దానిమ్మ, కొబ్బరి, మునగ, చింత, అల్లనేరేడు, ఆయిల్‌పామ్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల మొక్కలు నాటుకోవచ్చు.

• నాలుగేళ్లపాటు నిర్వహణ నిధులు...

పండ్ల మొక్కల నిర్వహణకు ఉపాధిహామీ నిధులు వెచ్చించనున్నారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం వంటి పనులన్నింటిని ఉపాధి కూలీలతో చేయిస్తారు. మరుసటి ఏడాది నుంచి మూడేళ్ల పాటు మొక్కల నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారు. నాలుగేళ్ల పాటు రైతు మొక్కలను సంరక్షించుకుంటే ఐదో ఏడాది ఫలాలు చేతికొస్తాయి. ఆయా సీజన్లకు అనుకూలంగా మొక్కల రకాలను ఎంచుకోవాలి. డిమాండ్ వేళ పండ్లు చేతికి వచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఉద్యానశాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవడం ప్రయోజనకరం.



అవగాహన కల్పించాలి

రైతులకు లాభం చేకూర్చే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కార్యక్రమంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. పండ్ల సాగు వల్ల కలిగే లాభనష్టాల గురించి రైతులకు మొదట తెలియజేస్తే రైతులు ఆలోచించి సాగు పనులు చేపడతారు.

– వంగల వెంకటరెడ్డి, ఆదర్శరైతు, సిర్సపల్లి

సద్వినియోగం చేసుకోవాలి

చిన్న,సన్నకారు రైతుల పంటభూముల్లో పండ్లమొక్కలు పెంచుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. అర్హత ఉన్న రైతులందరూ ఈ నెల 26వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలి. అధిక దరఖాస్తులు వచ్చినా పండ్ల మొక్కలు మంజూరు చేస్తాం. పెంపకం పట్ల రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తాం.

– బండారి శ్రీనివాస్, జిల్లా ఉద్యాన, పట్టుశాఖ అధికారి



బీఆర్ఎస్ వీణవంక మండల కమిటీ లేనట్టే..!

వీణవంక: బీఆర్ఎస్ వీణవంక మండల కమిటీ నియామకం ఇప్పట్లో లేనట్టే కనిపిస్తోంది. పార్టీ మండల అధ్యక్ష పదవి రేసులో తీవ్ర పోటీ నెలకొనడంతో నియామకం వాయిదా వేసినట్టు, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కమిటీ వేయాలనే ఆలోచనలో పార్టీ అధిష్టానం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల అన్ని గ్రామాలలో గ్రామ కమిటీల నియామకాలు పూర్తి చేశారు. ఇక మండల కమిటీ నియామకం అనివార్యమైంది. ఈటల రాజేందర్ బీజేపీలో చేరడంతో అప్పటి మండల అధ్యక్షుడు మారముల్ల కొంరయ్య కూడా బీజేపీలో చేరారు. అప్పటి నుంచి అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. ఓసీ సామాజిక వర్గానికి అధ్యక్ష పదవి కేటాయించనున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి తీవ్ర పోటీ నెలకొనడంతో నియామకం అటకెక్కింది. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆశావహులు ఎదురుచూడాల్సిందే.

మల్లారెడ్డిపల్లి సర్పంచ్‌కు సన్మానం

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి సర్పంచ్ మేకల ఎల్లారెడ్డిని గ్రామ శివాలయ అర్చకుడు అశోకాచార్యులతో పాటు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఇటీవల భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించినందుకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాములు, కొలిపాక శీను, పల్లెర్ల కిరణ్, కర్రె నాని, ప్రశాంత్, సురేశ్, సరస్వతి నాట్యమంటి కళాకారులు కొలిపాక రామస్వామి, దూలం కనకయ్య, గోనెల సమ్మయ్య, స్వామి తదితరులు ఉన్నారు.

రూ. లక్ష ఆర్థిక సాయంలో గీత కార్మికులను చేర్చాలి

చొప్పదండి: చేతి వృత్తులపై ఆధారపడిన గీత కార్మికులు, గౌడ కులస్తులను రూ. లక్ష ఆర్థిక సాయంలో చేర్చాలని పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల గంగయ్యగౌడ్, నాయకులు చేపూరి సత్యనారాయణగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గీత కార్మిక వృత్తిని ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని, ప్రభుత్వాలకు ప్రత్యక్షంగా కుల వృత్తి ద్వారా పన్ను చెల్లిస్తున్న ఏకైక సంఘం గౌడ సంఘమేనని అన్నారు.

కరీంనగర్ డెయిరీ తాడికల్ గ్రామ అధ్యక్షుడిగా రమణారెడ్డి



శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామ కరీంనగర్ డెయిరీ అధ్యక్షుడిగా ఏడోసారి రమణారెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కచ్చకాయల సంపత్, సభ్యులుగా అంకూశ్‌బీ, ఆడెపు రాజమౌళి, శ్రీకాంత్, సత్యనారాయణ, అంజయ్య ఎన్నికయ్యారు.



2013-14



1975-76

‘అపూర్వ’ సమ్మేళనం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల 2013-14 పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈసందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

జమ్మికుంట: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ 1975-76 పదో తరగతి విద్యార్థులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 47 ఏళ్ల తర్వాత 40 మంది మిత్రులు ఒక్కచోట కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ముక్క వెంకటేశ్వర్లు, అయిత యూగేందర్, ముక్క శివప్రసాద్, గుండా రమేష్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు



చొప్పదండిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో మందులు పంపిణీ

తిమ్మాపూర్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)ఆదేశాల మేరకు ‘ఆవో గావో చలో’(గ్రామాలకు వెళ్దాం) కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామకృష్ణకాలనీలో కరీంనగర్‌లోని సంజీవని నర్సింగ్ హోం డాక్టర్ ఆర్.విజయలక్ష్మి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు షుగర్, బీపీ, ఈసీజీ, గైనకాలజీ సంబంధించి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని ఐఎంఏ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పోలాస రామ్ కిరణ్ పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రియాంక, సంధ్య, సురేందర్ రెడ్డి, ఉమ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు....

ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంజీవని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా ప్లేట్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ మీసాల అంజయ్య, నుస్తులాపూర్ సహకార సంఘం చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. సంజీవని నర్సింగ్ హోమ్ వైద్యులు విజయలక్ష్మి గ్రామానికి చేస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఉప సర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డి, వార్డు సభ్యులు తిరుపతిరెడ్డి, అజయ్, సంపత్,నాయకులు వేల్పుల ఓదేలు యాదవ్ , పంచాయతీ కార్యదర్శులు లచ్చయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేవెళ్ల తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సన్‌రైజ్ హాస్పిటల్ సౌజన్యంతో శిబిరం నిర్వహించగా, సర్పంచ్ సౌజన్య, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్లు సురేశ్, ప్రసన్న, నవీన్, శ్రీజ వైద్య పరీక్షలు నిర్వహించారు. వెల్మ బాపురెడ్డి, అప్పిడి శ్యాంసుందర్ రెడ్డి, జీవన్ పాల్గొన్నారు.

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సురభి, ఆరూస్ ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని మూడు వందల మందికి ఉచితంగా వివిధ పరీక్షలు చేసి వైద్య సలహాలను అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడం పట్ల డాక్టర్ జక్కని తిరుపతి, చందనబాల దంపతులను ఏఎంసీ వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి అభినందించారు.శిబిరానికి కృషి చేసిన వాకర్స్ క్లబ్‌ను అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు కుమార్, రాము, అంజయ్య, సింహాచలం హరిక్రిష్ణ, ఆరెళ్ళి చంద్రశేఖర్‌గౌడ్, మాచర్ల వినయ్‌కుమార్, మునిగాల చందు, మాడూరి శ్రీనివాస్, పెరుమాండ్ల గంగయ్య, చేపూరి సత్యనారాయణ, తాళ్ళపెల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు శివకుమార్, మనోజ్‌కుమార్ కరీంనగర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. సర్పంచ్ పంజాల ప్రమీల, మాజీ సర్పంచ్ జగన్ మోహన్‌గౌడ్, బాబ్జి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంలో హుజూరాబాద్, జమ్మికుంట(ఐఎంఏ) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అన్ని రకాల వ్యాధులకు వైద్య నిపుణులు పరీక్షలు చేసి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఎంఏ అధ్యక్షుడు డా. సుధాకర్, ప్రధాన కార్యదర్శి డా. ఉడుగుల సురేష్, డాక్టర్లు శ్రీనివాస్, కిషోర్, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, వాణీ, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, కౌన్సిలర్లు రాము, శ్రీలత, విజయ గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో ఆదివారం కేపీఆర్ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు డాక్టర్ వంశీ దంపతులు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో రూ.4 లక్షలతో నిర్మించనున్న అచూర్‌ఖానా భవన్ (పీరీల భవన్) పనులకు ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తుందని, కమ్యూనిటీ భవనాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మానస, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం కమిటీ సభ్యులు రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. రాంచంద్రాపూర్ బీఆర్ఎస్ కార్యకర్త ఈరెల్లి రాజశేఖర్ ప్రమాదవశాత్తు కాలువ లో పడి మృతిచెందగ ఆయన కుటుంబానికి రూ. రెండు లక్షల పార్టీ బీమా చెక్కు ఇంటికెళ్లి అందజేశారు.

కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి

హుజూరాబాద్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద ముదిరాజ్ మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్ డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు సంఘం నాయకులతో కలిసి నిరసన తెలిపారు. కులం పేరుతో దూషించడం సరికాదని, తక్షణం క్షమాపణ చెప్పాలన్నారు.

శంకరపట్నం: కేశవపట్నంలో కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై ముదిరాజ్‌లు రాస్తారోకో చేశారు. కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.



మానకొండూర్‌రూరల్: కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముదిరాజ్‌లు

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో ముదిరాజ్‌లు కౌశిక్‌రెడ్డి శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు.

ప్రహరీకి శంకుస్థాపన

మానకొండూర్: మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఆదివారం సుడా చైర్మన్ జీవీఆర్ మాల సంఘం భవనం ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ శేఖర్, ఎంపీపీ సులోచన, ఎంపీటీసీలు కవిత, సులోచన, వార్డుమెంబర్ అవినాశ్, యు.అశోక్, యు.ఆంజనేయులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ ప్రదానం

హుజూరాబాద్: పట్టణానికి చెందిన సందమల్ల నరేశ్‌కు ఆదివారం హన్మకొండలోని కాకతీయ గౌడ ట్రస్ట్ భవన్‌లో సాయి శివాని ఒకేషనల్ అండ్ కల్చరల్ సొసైటీ 22వ వార్షికోత్సవంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. పలు సేవా, సాంస్కృతిక కార్యక్రమాలకు సందమల్ల నరేశ్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ అందుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ లయన్ పద్మజాదేవి, ఉప్పలపాటి విజయలక్ష్మి, తాళ్లపల్లి సురేష తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు కరాటే నేర్పించాలి



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సీఐ రమేశ్

హుజూరాబాద్: ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందనీ టౌన్ సీఐ బొల్లం రమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కాకతీయ స్కూల్ ఆవరణలో గ్లోబల్ షోటోకాన్ కరాటే డో ఇండియా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో కరాటే గ్రీటింగ్ బెల్ట్ టెస్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది విద్యార్థులు ఎల్లో, ఆరెంజ్, బ్లూ, పర్పుల్ బెల్టులు ప్రదానం చేశారు. సీఐ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలకు కరాటే నేర్పించాలని కరాటే నేర్చుకోవడం వల్ల చదువు మీద ఇంట్రెస్ట్, చెడు అలవాట్లకు దూరం అవతారని వివరించారు. అనంతరం కరాటే విద్యార్థులు, మాస్టర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో చందుపట్ల జనార్దన్, న్యాయవాది శ్యాంసుందర్, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ యాదగిరినాయక్, స్కూల్ కరస్పాండెంట్ బద్దుల రాజ్ కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాట్నపల్లిలో పోచమ్మ బోనాలు



చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామంలో నేతకాని సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం, మొక్కులు సమర్పించారు. బైండ్ల పూజారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాలు చేశారు.